క్లుప్తంగా

సాంబశివరావు జయంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ఉద్యమాల ఉపాధ్యాయుడు, కుల వర్గ సిద్ధాంతకర్త ఉ.సాంబ శివరావు 73వ జయంతిని సోమవారం తిరుమలగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య, భిక్షం, మధు, యాదగిరి, శ్రీనివాస్, నాగరాజు, కందుకూరి సోమయ్య, శ్రీను, రాంప్రభు, లింగయ్య, ఎల్లంల యాదగిరి, కిష్టు నాయక్ పాల్గొన్నారు.

తుంగతుర్తి తహసీల్దార్‌గా చామల రమణారెడ్డి



తుంగతుర్తి : తుంగతుర్తి మండల నూతన తహసీల్దార్‌గా చామల రమణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుమలగిరి మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై తుంగతుర్తి మండల తహసీల్దార్‌గా వచ్చారు. కాగా తుంగతుర్తి తహసీల్దార్‌గా పనిచేస్తున్న యాదగిరిరెడ్డి బదిలీపై మేడ్చల్ జిల్లాకు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమణారెడ్డికి డీటీ హరిశ్చంద్రప్రసాద్, రెవెన్యూసిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మకూరు తహసీల్దార్‌గా వినోద్‌కుమార్



ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల తహసీల్దార్‌గా జి.వినోద్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు తహసీల్దార్‌గా పనిచేసిన క్రిష్టయ్య చివ్వెంలకు బదిలీకాగా జి.వినోద్‌కుమార్ జీహెచ్ఎంసీ నుంచి బదిలీపై ఆత్మకూరుకు వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, రైతుల సమస్యలు తీర్చేందుకు తనవంతు కృషిచేస్తానని అన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

నూతనకల్ : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ సునీతను ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, ఎంపీటీసీలు సోమవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాద్దుల రజితలింగరాజు, పీఆర్‌పి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డికి సన్మానం

తిరుమలగిరి : రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సంకెపల్లి సుధీర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు హైదరాబాద్‌లో సుధీర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంకెపల్లి కొండల్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శాతవాహనరావు, ఎండీ.ఖలీల్, రాజిరెడ్డి, సురేందర్, సుధాకర్, విన్సెట్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ, కమిషనర్‌లకు సన్మానం

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి, ఎస్ఐ కె.సత్యనారాయణలను సోమవారం తోపుడు బండ్ల యజమానులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

అర్వపల్లి దేవాలయానికి రూ. లక్ష విరాళం


ఆలయ నిర్వహణకు రూ.లక్ష అందజేస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆలయ నిర్వాహకులకు సోమవారం రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానంద చారి, దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మోరపాక సత్యం, చేడె మహేందర్, శిగ నసీర్‌గౌడ్, కనుకు రేణుక, బైరబోయిన మహరాజు, బింగి శ్రీకాంత్, రాగి అనిల్, మామిడి రాజు, బాసాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

అర్వపల్లి : ఆపదలో ఉన్న కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని కుంచమర్తి గ్రామానికి చెందిన డాక్టర్ మహంకాళి వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ నుంచి మంజూరైన రూ. 2లక్షల బీమా చెక్కును సోమవారం మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అలుగుబెల్లి భాస్కర్‌రెడ్డి, ప్రశాంత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనంలోనే పశువైద్యం

- పెచ్చులూడి పడుతున్న అర్వపల్లిలోని పశువుల ఆస్పత్రి భవనం
- రెండున్నర ఏళ్లుగా నిలిచిన విద్యుత్ సరఫరా
- సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు, వైద్యసిబ్బంది


శిథిలమైన పశువైద్య కేంద్ర భవనం


పెచ్చులూడుతున్న భవనం స్లాబ్

అర్వపల్లి : అర్వపల్లిలోని మండల పశువైద్యశాల భవనం కాలం పూర్తిగా శిథిలమై కూలేదశకు చేరింది. అయినా తప్పని పరిస్థితుల్లో వైద్య సిబ్బంది ఈ ఆస్పత్రి భవనంలోనే మూగ జీవాలకు వైద్య సేవలందిస్తున్నారు. ముఖ్యంగా ఈ భవనానికి రెండున్నరేళ్ల నుంచి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఫ్రిడ్జి పనిచేయక పశువులకు ఉపయోగించే వ్యాక్సిన్ చెడిపోతుంది. పశువైద్యశాల డాక్టర్ తన ఇంట్లోని ఫ్రిడ్జిలో వ్యాక్సిన్ దాచాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంతేకాకుండా వర్షం వస్తే ఈ భవనం ఆవరణ మొత్తం నీటిలో మునుగుతుంది. భవనం స్లాబ్ పెచ్చులుగా ఊడి కిందపడుతుండటంతో డాక్టర్‌తోపాటు సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వైద్య సేవలందిస్తున్నారు.

గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి..

అర్వపల్లిలోని పశువైద్యశాల 50 ఏళ్ల కిందట నిర్మించినది కావడంతో పూర్తిగా శిథిలమై కాలం తీరిపోయింది. జాజిరెడ్డిగూడెం మండలంలోని మూగజీవాలకు ఈ ఆస్పత్రిలోనే వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆస్పత్రి ఆవరణలోని చేతి పంపు పనిచేయడంలేదు. పశువులకు వైద్యం అందించే పశువుల బోను విరిగి పోయింది. ముఖ్యంగా ఆస్పత్రిలోకి వెళ్లడానికి సరైన దారిలేదు. ప్రతి మూడు నెలలకోసారి మందుల స్టాకు వస్తుంది. అయితే ఈ మందులు ఎక్కడ పెట్టాలో తెలియక డాక్టర్, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కరెంట్ సరఫరాను పునరుద్ధరించాలని, ఆస్పత్రి భవనానికి మరమ్మతులు చేయించాలని లేదా కొత్త భవనం నిర్మించి వైద్యసేవలకు అంతరాయం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



ఇక్కడి ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలం కావడంతో కొత్త భవనం నిర్మించుటకు గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. సంత ఆవరణలో కొత్త భవన నిర్మాణం చేపడతామని గతంలో ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారు. వెంటనే భవనం నిర్మిస్తే రైతులకు పూర్తి స్థాయిలో పశువైద్య సేవలు అందిస్తాం.

– డాక్టర్ బి. అర్జున్, మండల పశువైద్యాధికారి

ఐక్యత మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో జరిగే సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్ పార్టీల ఐక్యత మహాసభల పోస్టర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడారు. ఈ సభలలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు పాల్గొని ప్రజావ్యతిరేక ప్రభుత్వాలు, వారి విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేర్పుల లక్ష్మయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

21నుంచి జోడో యాత్ర

అర్వపల్లి : బీజేపీకి వ్యతిరేకంగా ఈ నెల 21 నుంచి తెలంగాణలో జరిగే మాదిగ జోడోయాత్రను విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడు గంట మహేందర్ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. మాదిగల పంతం బీజేపీ అంతం పేరుతో హైదరాబాద్‌లోని అమీర్‌పేట నుంచి యాత్ర ప్రారంభమై కరీంనగర్‌లో ముగుస్తుందని చెప్పారు. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణను పక్కన పెట్టి రామమందిరాన్ని ప్రారంభించారని విమర్శించారు. మాదిగలు బీజేపీ వైపు వెళ్లకుండా అందరిని సంఘటిత పరుస్తామని పేర్కొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

నాగారం : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఫణిగిరి శివారులో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన చిర్రబోయిన నరేష్ వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై నాగారం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నాడు. అదే సమయంలో తిరుమలగిరి వైపు వెళ్తున్న ట్రాలీ ఆటోను అదుపుతప్పి ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న నరేష్ ఎగిరి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తొలుత సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి తల్లి చిర్రబోయిన యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

నేడు సోషల్ ఆడిట్

ఆత్మకూర్(ఎస్) : మండలంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ హసీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ ఆడిట్‌కు ఉపాధిహామీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, మేట్లు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బస్సులు లేక ప్రయాణికుల పాట్లు


సూర్యాపేట బస్టాండ్‌లో రద్దీగా ఉన్న జనం

మేడారం జాతరకు సూర్యాపేట డిపో నుంచి ప్రత్యేక బస్సులను కేటాయించడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి బస్సులు సరిపోను లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న బస్సుల్లో ఎక్కేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట


బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న జనం

విద్యార్థులకు ఇంగ్లిష్ నిఘంటువుల పంపిణీ


నిఘంటువులు అందజేస్తున్న దాత


సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సోమవారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి రూ.15వేల విలువ గల ఇంగ్లిష్, తెలుగు నిఘంటువులు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్‌జీఆర్‌ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య మాట్లాడారు. చిరిగిన చొక్కా అయిన తొడుక్కో అనే సామెతను గుర్తు చేస్తూ నిఘంటువుల వెల కన్నా వాటి విలువ ఎన్నో రెట్లు ఎక్కువని తెలిపారు. అంతర్జాతీయ భాషను అభివృద్ధి చేసుకోవడానికి నిఘంటువులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి సుదర్శన్, రాంబాబు, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కె.సురేందర్‌రెడ్డి, దీపి తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గంలో ఈ నెల 21న జరిగే బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబు కోరారు. సోమవారం మండల కేంద్రంలో విజయ సంకల్ప యాత్ర పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. విజయ సంకల్ప యాత్ర ఈ నెల 20న యాదాద్రి భువనగిరిలో ప్రారంభమై 21న తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని మోత్కూర్ నుంచి యాత్ర ప్రారంభమై తిరుమలగిరిలో కార్నర్ మీటింగ్ ఉంటుందని అన్నారు. అక్కడి నుంచి నాగారం మీదుగా తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం మీదుగా వెళ్లి శాలిగౌరారం వద్ద యాత్ర ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, సంకినేని వెంకటేశ్వర్‌రావు పాల్గొంటారని తెలిపారు. విజయ సంకల్ప యాత్రకు ప్రతి గ్రామం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పుల లింగయ్య, అంబటి రమేష్, పెండెం యాదగిరి, మహేష్, రఫీక్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలన


నూతనకల్ జెడ్పీహెచ్ఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మానిటరింగ్ అధికారులు


మద్దిరాల : చిన్న నెమిలలో..

నూతనకల్ : పదో తరగతి విద్యార్థులకు వేసిన అంతర్గత మార్కులను మూల్యాంకన బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. మండల పరిధిలోని వెంకెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్కుల రిజిస్టర్లు, రికార్డులు, ప్రాజెక్టు వర్క్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల మానిటరింగ్ అధికారి బి. శివయ్య, బృందం సభ్యులు భాషిత్ అలీ, బోసుబాబు, షాబుద్దీన్, ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, సోమయ్య, రజిత, జయమ్మ, ఝాన్సీ, అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : చిన్ననెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల అంతర్గత మూల్యాంకన పత్రాలను సోమవారం మండల మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యాకయ్య, ఆర్.రమేష్, రవీందర్ బాబు, హస్రన్, ఉపేందర్‌రెడ్డి, సాల్మన్, ప్రదీప్‌కుమార్, మధుకర్, అవిలయ్య పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏలియా, రవీందర్

దురాజ్‌పల్లి : తన భూమిపైకి రానివ్వకుండా అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని చివ్వెంల మండలం గాయంవారిగూడేనికి చెందిన రత్నావత్ పావని కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తన భర్త నాగరాజు కరోనాతో మరణించారని, తనకు ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. అయితే భర్త పేరున ఉన్న వ్యవసాయ భూమిని తన ఇద్దరు పిల్లలతో పాటు తన పేరున రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలు పొందామని తెలిపారు. అయితే తమ పాలివారు ఈ భూమి మీదకు రాకుండా అడ్డుపడుతున్నారని, తన భూమి తనకు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

అక్రమ మ్యూటేషన్ రద్దు చేయాలి..

ఉమ్మడి కుటుంబానికి సంబంధించిన భూమిని కుటుంబ సభ్యులకు తెలియకుండా కుటుంబంలోని ఒక్కరైన పిండింగ మనోహర్ చేసుకున్న అక్రమ మ్యూటేషన్ రద్దు చేయాలని పిండిగా ఏలియా, పిండిగా రవీందర్ కోరారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టర్ ఎస్.వెంకట్రావుకు ఫిర్యాదు అందించారు. బాధితులు తెలిపిన ప్రకారం.. చివ్వెంల మండలం కుడకుడకు చెందిన రాజరత్నంకు పిండిగ ఏలియా, మనోహర్, రవీందర్, అశోక్, కోడిరెక్క స్వరూప ఐదుగురు సంతానం. అయితే కుడ కుడ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 127/ఇలో .0–27 గుంటల భూమిని తహసీల్దార్‌తో కుమ్మక్కై రెండవవాడైన పిండిగ మనోహర్ పేరున పట్టా చేయించుకున్నట్లు తెలిపారు. సదరు భూమిని ఎలాంటి సమాచారం లేకుండా, మ్యూటేషన్ చేశారని.. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి సదరు తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

హిందూ మతానికి ప్రాణం పోసిన వ్యక్తి శివాజీ


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : భారతదేశ చరిత్రలో హిందూ మతానికి ప్రాణం పోసిన చరిత్ర ఛత్రపతి శివాజీ మహారాజ్‌దే అని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో శోభయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రను స్థానిక భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఇమ్మడి సోమనర్సయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శివాజీ మహారాజ్ మొగల్ రాజులతో వీరోచితంగా పోరాడి హిందూ మతాన్ని కాపాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో కెక్కిరేణి చంద్రశేఖర్, పసుపతి కృష్ణమూర్తి, సోమ సుమన్, మహంకాళి సోమయ్య, మంచాల రంగయ్య, బండపల్లి పాండురంగాచారి, సలిగంటి వీరేందర్, తన్నీరు వాసుదేవ్, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, బచ్చు పురుషోత్తం, హిందూ వాహిని పెద్దలు మధు, కాసర్ల శ్రీకాంత్, బచ్చలకూరి విష్ణు, ముప్పాని హరీష్‌రెడ్డి, పూస వెంకట్, సైదులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



తిరుమలగిరి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : తాటిపాములలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. సోమవారం తాటిపాముల గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తాటిపాముల గ్రామానికి ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, గ్రామ అధ్యక్షుడు నాయిని కృష్ణ, యాదగిరి, సర్జన్, నర్సింహ, యాదగిరి, అంజి, సుదర్శన్, కిష్టయ్య, భిక్షం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉత్సవ కమిటీ సభ్యులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకై ఇటీవల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు సోమవారం తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ నెల 24న జరిగే స్వామి కల్యాణోత్సవానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మోరపాక సత్యం, మాజీ సర్పంచ్‌లు పాలెల్లి సురేష్, జీడి వీరస్వామి, ధర్మకర్తలు కనుకు రేణుక, రత్నం లక్ష్మాజీ, దిర్శనపు కృష్ణమూర్తి, జెర్రిపోతుల సోమయ్య, శిగ నసీర్‌గౌడ్, అమీనుద్దీన్ పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు షురూ..

- యోగానందలక్ష్మీనర్సింహుడి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- మార్చి 8 వరకు జరగనున్న వేడుకలు


శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయం

అర్వపల్లి : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ప్రతి సంవత్సరం మాఘశుద్ధ పౌర్ణమి మొదలుకొని 18 రోజులపాటు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. దేవాలయానికి రంగులు వేసి ఆలయాలను శుభ్రం చేసి తగు ఏర్పాట్లు చేశారు. తొలి మూడు రోజులు అధ్యయనోత్సవాలు జరుగుతాయి. 23న ధ్వజారోహణం, 24న కల్యాణోత్సవం, 26న రథోత్సవం, 28న పాన్నోత్సవం, మార్చి 5న పారువేట కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు.

అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఆలయంలో అన్నదానం జరగనుంది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు కబడ్డీ పోటీలు కూడా ఉండనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కొబ్బరికాయల దుకాణం నిర్వహణకు వేలం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి మార్చి 8 వరకు జరగనుండటంతో కొబ్బరికాయల దుకాణం నిర్వహణకై సోమవారం స్థానిక దేవస్థాన ఆవరణలో వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారి మీలా వెంకటేశ్వర్లు రూ. 45వేలకు పాట పాడి కొబ్బరికాయల దుకాణం దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, రాగి అనిల్, చిల్లంచర్ల రామ్మోహన్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


తిరుమలగిరిలో పూజలు చేస్తున్న భక్తులు

తిరుమలగిరి : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠలో భాగంగా సోమవారం ప్ర త్యేక పూజలు నిర్వహించారు. రక్షా బంధనం, పంచ గ్రహణం, అగ్ని ప్రతిష్ఠ హోమం తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, తునికిపాటి రాంబాబు, సామ ఆంజనేయులు, గజ్జి ఉపేందర్, రాపాక సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

అర్వపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వివిధ వేషధారణల్లో అలరించారు. ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి. బాలునాయక్, ఉపాధ్యాయులు ఎస్. మంజుల, కేసీహెచ్. వెంకట్‌రెడ్డి, వి. ఇందిరమ్మ, పీడీ సోమయ్య, ప్రసన్నకుమారి, ఉమా, సంపత్‌కుమార్, రాజ్యలక్ష్మి, నోముల వెంకటేశ్వర్లు, రజిని, లింగస్వామి, యాదగిరి, ప్రసాద్, వెంకట్, చంద్రకళ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మహేందర్‌నాథ్

అర్వపల్లి : సైబర్ నేరాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఇందారపు మహేందర్‌నాథ్ కోరారు. ఎస్పీ హెగ్డే, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవిల ఆధ్వర్యంలో సోమవారం అర్వపల్లిలోని నాగారం కేజీబీవీలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో షీటీమ్స్, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లల భద్రత, డయల్ 100, సోషల్‌మీడియా, ఓటీపీ నేరాలు, టోల్‌ఫ్రీ నంబర్ 1930, సెల్‌ఫోన్ వలన కలిగే అనర్థాలు తదితర అంశాలపై పోలీస్ కళాబృందం ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ ఎస్‌కే శిరీన్, షీటీమ్ కానిస్టేబుల్ శివరాం, సతీష్, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, నాగార్జున, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు జీరో అకౌంట్‌లు


విద్యార్థులకు బ్యాంక్ అకౌంట్‌లను అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ నవీన్‌కుమార్

పెన్‌పహాడ్ : జీరో అకౌంట్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ చీదెళ్ల బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్, ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. చీదెళ్ల ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీరో అకౌంట్‌లను ఓపెన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ సేవా కేంద్రం నిర్వాహకులు పేరూరి వెంకటేష్, ఉపాధ్యాయులు జమాల్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.